క్లుప్తంగా

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందుకొంటున్న మంత్రి సురేఖ

సిద్దిపేటరూరల్: పుల్లూరు శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బండజాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. గురువారం వారు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భవిష్యత్‌లో నిధులు కేటాయించి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య గౌడ్, డైరెక్టర్లు దేవిరెడ్డి, రవి, రాములు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న సోమయ్య

హుస్నాబాద్: జర్నలిస్టుల సమస్యలను ఈ ప్రభుత్వమైనా పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. గురువారం అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో జిల్లా ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను విస్మరించడం సరికాదన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా వరయోగుల మురళీధర్ స్వామి, కార్యదర్శి మేకల ఎల్లయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రమేశ్

దుబ్బాక: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ మెదక్ పార్లమెంట్ అధ్యక్షుడు, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఇల్లెందుల రమేశ్ ప్రశంసించారు. గురువారం దుబ్బాకలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. ఆకుల రాములు, లక్ష్మణ్, రవీందర్, భాస్కర్, మహేశ్ పాల్గొన్నారు.

మైనంపల్లిని విమర్శిస్తే సహించేదిలేదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: మైనంపల్లి హన్మంతరవును విమర్శిస్తే సహించేదిలేదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, సోషల్‌మీడియా జిల్లా ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో జరుగుతున్న అరాచకాలు, నియంతృత్వం నుంచి విముక్తి పొందేందుకు మైనంపల్లి బయటకు వచ్చారన్నారు. అతనిపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో బాలాగౌడ్, గణేశ్, ఎండీ రైజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ లత

తొగుట(దుబ్బాక): మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ లత, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తొగుట బీసీ కాలనీ, ఘనపురంలోను సీసీ రోడ్ల నిర్మాణానికి చెరో రూ.20 లక్షలు, అలాగే వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, వివిధ సంఘాల భవనాలకు రూ.10 లక్షలు, రూ.5 లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన వివరించారు.

గురువుల కొరత.. బోధన భారం

- మండలంలో 22 పోస్టులు ఖాళీ
- ఉన్నవారిపై అదనపు ఒత్తిడి
- తల్లిదండ్రుల ఆందోళన


పెద్దకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించాలంటూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. మరోవైపు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో పనిచేసే వారిపై అదనపు భారం పడుతోంది. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో సరైన విద్యాబోధన అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉపాధ్యాయ ఖాళీలు ఇలా..

మండలంలో మొత్తంగా 55 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 16 ఉన్నత, 4 ప్రాథమికోన్నత, 35 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మొత్తంగా 264 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, 242 మంది మాత్రమే ఉన్నారు. 22 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగూ మండలంలో ఎస్‌జీటీ పోస్టులు 6, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు 5, స్కూల్ అసిస్టెంట్ 10, క్రాఫ్ట్ ఒకపోస్టు ఖాళీగా ఉంది. వాటిలో స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్) యూపీఎస్ కిష్టాపూర్ ఒకటి, అల్లీపూర్‌లో(బయోసైన్స్) ఒకటి, చౌడారంలో(బయోసైన్స్) ఒకటి, గోనెపల్లిలో(బయోసైన్స్) ఒకటి, చంద్లాపూర్, చిన్నకోడూరు, రాముునిపట్ల, మల్లారంలో (సోషల్) ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు అల్లీపూర్, అనంతసాగర్, గంగాపూర్, హరిజనవాడ, మాచాపూర్‌లో ఖాళీగా ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులు గంగాపూర్, గోనెపల్లి, పెద్దకోడూరు, సికింద్లాపూర్, ఖైరిసాగర్, ఎల్లమ్మజాలు, గంగాపూర్ ఉన్నత పాఠశాలలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సరైన విద్యాబోధన అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. మరోవైపు మన ఊరు– మన బడి కార్యక్రమంతో పాఠశాలలను బలోపేతం చేస్తుంది. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని పలువురు వాపోతున్నారు.

అధికారులకు నివేదించాం..

మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉన్నది వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోటికి ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేశాం. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– దేశిరెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ

తండాకు బస్సు వచ్చింది..

మంత్రి పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం


మంత్రి పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తండావాసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలంటూ పదేళ్లుగా ఎదురుచూస్తున్న కపూర్ నాయక్‌తండా వాసులకు ఆ కల నెరవేరింది. దానికి కృషిచేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని తమ గ్రామానికి తారురోడ్డు ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గ్రామ పరిధిలో ఆరుగిరిజన తండాలు ఉంటాయని, బస్సు సౌకర్యంలేక ప్రజలు అనేక అవస్థలు పడ్డామని చెప్పారు. తండాల మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నంకు రుణపడి ఉంటామని తండావాసులు అన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు భానోతు భాస్కర్‌నాయక్, లింగమూర్తి, అజ్మీర అనిల్‌నాయక్, వెన్న రాజు, వాసాల లింగయ్య, గుగులోతు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభించిన చైర్ పర్సన్ స్వరూపరాణి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 3వ వార్డు బురాన్ మియా తోటలో సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద రూ.5లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి కౌన్సిలర్ మంగోలు చంటితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చే వన దేవతల గద్దెల వద్ద భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ సతీశ్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యుడు ముస్త్యాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలే లక్ష్యం

కాంగ్రెస్ నేత హరికృష్ణ


జెండాను ఆవిష్కరించిన నాయకులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, పది లక్షల ఆరోగ్య బీమా, రైతుబంధు పథకాలు అమలు చేసిందన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా రక్షణగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని హ రికృష్ణ తెలిపారు. నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు.

మత్తు పదార్థాల వల్ల ఎన్నో అనర్థాలు


మాట్లాడుతున్న సీఐ శ్రీను

నంగునూరు(సిద్దిపేట): ఎవరైనా గంజాయి తాగినా, అమ్మినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిద్దిపేట రూరల్ సీఐ ఎం.శ్రీను కోరారు. బుధవారం రాత్రి ఘణాపూర్‌లో కళాజాత నిర్వహించి మంత్రాలు, మూఢ నమ్మకాలు, గంజాయి తాగితే కలిగే నష్టాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమేశ్

నంగునూరు(సిద్దిపేట): వారం రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ రమేశ్ ప్రత్యేక అధికారులకు సూచించారు. బుధవారం వెంకటాపూర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. వీధుల్లో తిరిగి మురుగుకాల్వలను పరిశీలించి చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలని కార్మికులను ఆదేశించారు. అనతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం పనులు నిర్వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రాంరెడ్డి

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ ప్రజా స్వామ్యాన్ని ఖూనీచేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్ నుంచి దుబ్బాక కాలువకు నీటిని విడుదల చేసిన సమయంలో స్థానిక నేతలకు సమాచారం ఇవ్వకుండా మంత్రి కొండా సురేఖ నీటిని విడుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేసిన పనులు రద్దుచేయించి, వాటిస్థానంలో కొత్తగా మంజూరు చేసినట్టు చెరుకు శ్రీనివాస్ రెడ్డి కొబ్బరి కాయలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్ కార్యాయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వామి, మండల కో ఆప్షన్‌సభ్యుడు కలీముద్దిన్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ నరేందర్, మండల యూత్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి


భూపతి (ఫైల్)

దుబ్బాకటౌన్: ధర్మాజీపేటకు చెందిన దుబ్బరిగల్ల భూపతి(65) సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం.. భూపతి జనవరి 31న ఇంట్లో నుంచి భయటకు వెళ్లాడు. హై బీపీ వల్ల కళ్లుతిరిగి డ్రైనేజీలో పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడి..


దశరథం (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ సాయిలు కథనం ప్రకారం.. తుర్కనర్సంపల్లికి చెందిన దశరథం తన పెద్దమ్మ పోచవ్వను చూసి బైక్‌పై వెళ్తుండగా గోవిందాపూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గ్రామానికి చెందిన గుడిసే రవిగౌడ్ చూసి మృతుడి భార్యకు సమాచారం అందించాడు. ఆమె దశరథంను రామాంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం సుచిత్ర వద్ద రష్ దవాఖానకు తరలించారు. దశరథం చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బండ జాతర పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: పుల్లూరు శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం బండజాతర పోస్టర్‌ను ఆలయ కమిటీ, అర్చకులు ఆవిష్కరించారు. గురువారం ఆలయ చైర్మన్ కనకయ్యగౌడ్, అర్చకుడు రాముశర్మ మాట్లాడుతూ మాఘ అమావాస్యను పురస్కరించుకుని 9వ తేదీ నుంచి జాతర ప్రారంభం కానుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుండి ఈ జాతరకు భక్తులు వస్తున్నందున అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు దేవిరెడ్డి, యాదయ్య, రవి, కిష్టయ్య, రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు, వెంకటేశ్, యూత్ మండల అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉనికి కోసమే మైనంపల్లి ఆరాటం

సర్పంచుల ఫోరం మాజీ నేత


మాట్లాడుతున్న బాల్‌రాజు

మిరుదొడ్డి(దుబ్బాక): రాజకీయ ఉనికి కోసమే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆరాట పడుతున్నారని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ విమర్శించారు. గురువారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ.. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును మైనంపల్లి విమర్శిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావును విమర్శించే నైతిక హక్కు మైనంపల్లి హనుమంతరావుకు లేదన్నారు.

వంద రోజులు పనిదినాలు కల్పించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలకు వంద రోజుల పనిదినాలను కల్పించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. గురువారం హైద్రాబాద్‌లోని పీఆర్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ అనిత రాంచంద్రన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉపాధి కూలీల సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, టస్కాను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, కవిత పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ఆడిట్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో రెండు రోజులుగా జనరల్ ఆడిట్ కొనసాగుతోంది. గురువారం ఒక సీనియర్, ఇద్దరు జూనియర్ ఆడిటర్లు రికార్డులు పరిశీలించారు. 2018 నుంచి 2023 వరకు జరిగిన లావాదేవీలపై ఆరా తీశారు. నివేదిక అందించనున్నారు.

రూ.లక్ష బీమా చెక్కు అందజేత

సిద్దిపేటరూరల్: గాయత్రి బ్యాంక్ ఖాతాదారులైన పంజా కరుణాకర్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో నిర్భయ సేవింగ్ ఖాతాపై ఉన్న రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును కలెక్టరేట్ ఏఓ రెహమన్ మృతుడి భార్య జమునకు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం

ఎస్ఐ శ్రీనివాస్


అవగాహన కల్పిస్తున్న షీటీమ్ అధికారి

హుస్నాబాద్: బాల్య వివాహాలు చేసుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హుస్నాబాద్ నెంబర్ 2 ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్న పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలన, సైబర్ నేరాలతో పాటు పలు అంశాలపై పోలీస్‌లు, షీటీమ్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఒకరికొకరు చదువులో సహాయం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఇష్టపడి చదువుకోవాలని, సైబర్ నేరాలపై అప్రమత్తతంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా గురించి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, ఏఎస్ఐ మణెమ్మ, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్‌కేర్ ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రంగారెడ్డి, రాజు, పద్మ, స్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మాఘ అమావాస్యకు ఏర్పాట్లు


సలేంద్రి రామలింగేశ్వర దేవాలయం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సలేంద్రి రామలింగేశ్వర దేవాలయం మాఘ అమావాస్య పర్వదినానికి ముస్తాబైంది. శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ రోజున ఆలయం వద్ద ఉన్న కోనేరులో స్నానం ఆచరిస్తే ఆరోగ్యంగా ఉంటారని భక్తుల నమ్మకం. అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

◆ 2300 దరఖాస్తుల తిరస్కరణ

హుస్నాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులల్లో 2307 దరఖాస్తులను తిరస్కరించినట్టు మున్సిపల్ అధికారులు గురువారం తెలిపారు. పట్టణంలో మొత్తం 6918 దరఖాస్తులకుగాను 2307 దరఖాస్తులు గ్యాస్ నంబర్లు సరిగా లేనందున తిరస్కరించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారుల ఇండ్ల వద్దకు వెళ్లి గ్యాస్ నంబర్ల డేటాను మళ్లీ సేకరించాలని వార్డు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

◆ బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం

చిన్నకోడూరు(సిద్దిపేట): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను గురువారం కాంగ్రెస్ నాయకులు చిన్నకోడూరులో దహనం చేశారు. మండల అధ్యక్షుడు మీసం మహేందర్ యాదవ్ మాట్లాడుతూ బాల్క సుమన్ పదవి కోల్పోవడంతో మతిభ్రమించిందని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

హంతకులను శిక్షించాలి

నంగునూరు(సిద్దిపేట): ఘణపూర్ మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని యాదవ సంఘం మండలాధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ వెంకటయ్యను దారుణంగా కొట్టి చంపారన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుచక్రవర్తి, గుండెల్లి రాజయ్య, చెలికాని మల్లేశం, పరమాండ్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా గురువారం విచారణ జరిపిన జడ్జి శ్రావణి 10 మందికి రూ.11 వేల జరిమానా విధించారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం :మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


చెక్కును అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

మర్కూక్(గజ్వేల్): కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాచారం ఆలయ మాజీ చైర్మన్ హన్మంతరావు తెలిపారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిన కిష్టయ్య ఇటీవల మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో అతడికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును వారు గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య, గ్రామ అధ్యక్షుడు మహేశ్, రాజేష్‌గౌడ్, వెంకటేశం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ముగింపు సందడి

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలోని స్వయంభు శంభు దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సందడిగా ముగిశాయి. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. బుధవారం రాత్రి స్వయంభు శంభు దేవాలయ అభివృద్ధి ట్రస్టు సభ్యులు పెద్దంకుల శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు అత్యంత వైభవంగ బ్రహ్మోత్సవాల నిర్వహించామన్నారు. సహకరించిన ఉపాధ్యాయులు బాకి చంద్రభాను, రజనీని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అనంతుల నరేందర్, ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, గోనె శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు